ప్రజాశక్తి
శనివారం 4 జనవరి 2025 | 5 | విజయనగరం

పసిపాపపై లైంగిక దాడి కేసులో
నిందితుడికి 25 ఏళ్ల జైలు

విజయనగరం కోట : జిల్లాలో సంచలనం రేపిన పసిపాపపై లైంగిక దాడి ఘటనలో నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగారశిక్ష పడింది. నిందితుడికి శిక్ష వేస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పి వకుల్ జిందాల్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రామభద్రపురం మండలం నేరెళ్లవలస పంచాయతీ జన్నివలసలో గత ఏడాది జులై 13న ఉయ్యాల్లో ఉన్న ఆరు నెలల పసిపాపపై అదే గ్రామానికి చెందిన బోయిన ఎరుకన్నదొర (40) లైంగిక దాడికి పాల్పడ్డాడు. అప్పట్లో నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. డిఎస్పి పి.శ్రీనివాసరావు, అప్పటి బొబ్బిలి రూరల్ సిఐ ఎస్.తిరుమలరావు, రామభద్రపురం ఎస్ఐ జ్ఞాన ప్రసాద్‌దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 25ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఆరు నెలల్లోనే నిందితుడికి శిక్షపడేలా అభియోగ పత్రాలు దాఖలు చేసిన పోలీసు అధికారులను ఎస్పి ఈ సందర్భంగా అభినందించారు.

ఉద్యోగుల రాష్ట్ర బీమా.. మందులు లేవమ్మా..

ఔను...! ఇక్కడ మందులు లేకుండానే వైద్యసేవలందిస్తారు. రోగులను తనిఖీ చేయడానికి ముందు ఈ ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే చాలు రోగులను పరీక్షించేందుకు గంటల తరబడి నిరీక్షణ అవసరం లేదు. రోగులను కొందరు వైద్యులు టకటకా ప్రశ్నల వర్షం కురిపిస్తారు. మరికొందరు వైద్యులు 'నా మాటే బంగారం' అన్నట్టుగా మౌనంతోనే ప్రిస్క్రిప్షన్ చీటీ నింపేస్తారు. అందులో రాసింది మందులే అయినా, ఇక్కడ ఇవ్వడానికి అటువంటివేమీ ఉండవండోయ్. దీంతో రోగులు మాత్రం మందులు బయట కొనుగోలు చేసుకోవాల్సిందే. ఇదీ విజయనగరంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యాన నడుస్తున్న ఇఎస్ఐ ఆసుపత్రిలో దుస్థితి.

- రోగుల ఆరోగ్యానికి ఇఎస్ఐ ఆస్పత్రిలో నో గ్యారెంటీ
- అవస్థలు పడుతున్న బాధితులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఇఎస్ఐసి (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) 1948లోనే ఏర్పాటైంది. కార్మికులకు నెలనెలా వస్తున్న వేతన ఆదాయాన్నిబట్టి కొంతమొత్తాన్ని ఇఎస్ఐ పేరిట కోత విధిస్తారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, నెలిమర్ల, కొత్తవలస, గరివిడిలో ఇఎస్ఐ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో విజయనగరంలో వున్నది డయోగ్నోస్టిక్ సెంటర్ కాగా, మిగిలినవన్నీ డిస్పెన్సరీలు. పది పడకలతోవున్న విజయనగరం ఆసుపత్రి నుంచే డిస్పెరీలకు కూడా మందులు సరఫరా అవుతాయి. విజయనగరానికి విశాఖలోని మల్కాపురం రీజనల్ ఆసుపత్రి నుంచి రావాల్సి వుంటుంది. విజయనగరం డయోగ్నోస్టిక్ సెంటర్ పరిధిలో సుమారు 10వేల మంది ఇఎస్ఐ కార్డుదారులు ఉన్నారు. ఒక్కో కార్డుదారునికీ తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారనుకున్నా కుటుంబానికి ఆరుగురు చొప్పున ఈ ఆసుపత్రిలో 60వేల మందికి వైద్య సేవలు అందించాల్సివుంది. ఇంతటి కీలకమైన ఆసుపత్రిలో గడిచిన ఆరు నెలలుగా మందులు లేవు. డిస్పెన్సరీల్లోనూ ఇదే పరిస్థితి దాపురించింది.

జ్వరం, బిపి మాత్రలూ కరువే

ప్రమాదంలో గాయపడినవారికి ఉపయోగించే టిటి, కుక్కకాటుకు ఉపయోగించే ర్యాబిస్ ఇంజక్షన్ కూడా ఇఎస్ఐ ఆస్పత్రిలో లేకపోవడం గమనార్హం. చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉన్నప్పటికీ ఆ విభాగంలో పారాసిటమోల్ జ్వరం మాత్రలుగానీ, టానిక్కులుగానీ లేవు. ఆర్థోపెడిక్, డెంటల్, గైనిక్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ వంటి పది రకాల స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నప్పటికీ ఆయా విభాగాలకు వచ్చిన రోగులకు కనీసంగా ఉపయోగించే మందులు కూడా లేవంటే అతిశయోక్తి కాదు. సుగర్ మాత్రలు కూడా అందుబాటు లేవంటున్నారని ఇఎస్ఐ ఆసుపత్రికి శుక్రవారం వచ్చిన జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీలో పనిచేసిన ఓ చిరుద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. తాను గుండె సమస్యతో బాధపడు తున్నానని, వైద్యులు తనకు 11రకాల మందులు రాస్తే మూడే మూడు రకాలు దొరికాయని, మిగిలినవి బయట కొనుక్కోవాలంటే రూ.వేలు ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఉందని ప్రజాశక్తికి చెప్పారు. ఇలా నెల రోజులుగా ఆసుపత్రికి వచ్చినరోగుల్లో ఎవరిని కదిపినా ఇదే పరిస్థితి. బిపి మాత్రలు కూడా నెల రోజులుగా అందు బాటులో లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన రోగులు అవస్థలు పడుతున్నారు. కనీసం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోకూడా ఆ మందులు దొరకని పరిస్థితి ఉంది.

మూతపడ్డ లేబొరేటరీ

ఇఎస్ఐ ఆస్పత్రిలో లేబొరేటరీ కూడా మూతపడింది. గతంలో ఇక్కడ అన్ని రకాల రక్త పరీక్షలు, ఎక్స్‌రే తదితర వైద్య పరీక్షలు నిర్వహించేవారు. ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నప్పటికీ ల్యాబ్‌కు అవసరమైన పరికరాలు లేవని నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్స్‌రే ప్లాంట్ ఉన్నప్పటికీ, ఇక్కడి టెక్నీషియన్‌ను విశాఖలోని రీజనల్ ఆసుపత్రికి పంపేశారు.

ఇండెంట్‌తో సరి

ఇఎస్ఐ ఆస్పత్రి నిర్వాహకులు కూడా మందుల కోసం ఇండెంట్ పెట్టడంతో సరి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి పరిస్థితిని బట్టి పదే పదే ఉన్నతాధికారులకు లెటర్లు రాయడం వంటి తాపత్రయం ఏమీ కనిపించడం లేదు. ఇందుకు కూడా పలు కారణాలు ఉన్నాయి.

విజయనగరంలోని ఇఎస్ఐ ఆస్పత్రి

ఆర్నెల్లుగా మందులు కరువు

ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇండెంట్ తీసుకుని మందులు పంపాలి. కానీ, 2024లో కేవలం జనవరి, జూన్ నెలలో మాత్రమే మందులు వచ్చాయి. అంటే ఆరు నెలలకోసారి మాత్రమే అందాయి.

ఇలా వచ్చిన మందులు మూడు నెలలకే సరిపోవడంతో, తగులు మిగులు మందులతో మరో మూడు నెలలపాటు ఫార్మా సిబ్బంది నెట్టుకుంటూ వస్తున్నారు. ఉన్న కొద్దిపాటి మందులు కూడా ఎక్స్‌పైరీ డేట్‌కు దగ్గరగా ఉన్నాయి. ఈనేపథ్యంలో వైద్యులు రాసిన చీటీ ప్రకారం నెలకు సరిపడా మందులు ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం ఆరు నెలలు దాటిపోయినప్పటికీ మందులు ఇంకా రాకపోవడంతో రోగుల ఇబ్బందులు తీవ్ర తరమయ్యాయి.

బిపి మాత్రలు కూడా లేవన్నారు

చాలా ఏళ్లగా బిపి మందులు వాడుతున్నాను. కొన్ని నెలలుగా విజయనగరం ఇఎస్ఐ ఆసుపత్రిలో బిపి మాత్రలు ఇవ్వడం లేదు. ఇక్కడి వైద్యులు రాసిన మాత్రలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ దొరకడం లేదు. బయట కొనుకుందామనుకున్నా కంపెనీలు మారిపోతున్నాయి. సరిగా పనిచేయడం లేదు.

- ఇల్లాపు పైడమ్మ, మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు, విజయనగరం

త్వరలో మందులు వస్తాయి

త్వరలోనే మందులు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం కొన్ని రకాల మందులు లేకపోవడం వాస్తవమే. ప్రస్తుతం మల్కాపురం రీజినల్ ఆసుపత్రిలో ఉన్నట్టుగా సమాచారం. ఎపిఎస్ ఆర్టీసీ కార్గో ద్వారా ఇక్కడికి మందులు రావాల్సి ఉంటుంది. ఆర్టీసీకి బకాయి ఉండడంతో వారు సహకరించడంలేదని సమాచారం. ఈ సమస్య కూడా కొద్ది రోజుల్లోనే పరిష్కారమౌతుందని ఆశిస్తున్నాం.

- టి.కృష్ణ కిషోర్, సూపరింటెండెంట్, ఇఎస్ఐ ఆస్పత్రి, విజయనగరం

సహారా బాధితులకు న్యాయం చేయాలి

లేకుంటే దేశవ్యాప్త ఉద్యమం : సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సహారా ఇండియా ఖాతాదారులకు, ఏజెంట్లకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, లేకుంటే దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం శృంగవరపుకోటలో సహారా ఇండియా పోరాట కమిటీ ఆధ్వర్యంలో సహారా కార్యాలయం నుంచి దేవి కూడలి వరకు ఖాతాదారులు, ఏజెంట్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. దేవి కూడలిలో మానవహారం చేపట్టారు. తొలుత సహారా ఇండియా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడారు. పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు, కష్టకాలంలో ఉపయోగపడతాయని ఖాతాదారులు పొదుపు చేసుకుంటే, ఆ డబ్బులను సహారా యాజమాన్యం తిరిగి ఖాతాదారులకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకొని సహారా యాజమాన్యం నుంచి ఖాతాదారులకు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సిన మోడి ప్రభుత్వం.. దోచుకున్న వాళ్లకు కొమ్ముకాయడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా ఉన్న సహారా బాధితులు ఐదారేళ్లుగా రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తుంటే, కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. సహారా బాధితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణ చేపట్టి, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

అనంతరం తెలంగాణాకు చెందిన సహారా ఖాతాల పోరాట సంఘం నాయకులు పూజిత మాట్లాడుతూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తేనే కేంద్ర ప్రభుత్వం తలవంచి ప్రతి ఖాతాదారునికి డబ్బులు చెల్లించే ప్రక్రియను ప్రారంభిస్తుందని స్పష్టంచేశారు. ఈ సభలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వచ్చిన బ్రాంచ్ మేనేజర్లు, ఏజెంట్లు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, బాధితుల సంఘం జిల్లా కార్యదర్శి సూరిబాబు, మండల అధ్యక్షులు షేక్ ఖాన్, ఏజెంట్లు, మేనేజర్లు, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు, సహారా బాధితుల సంఘం నాయకులు, ఖాతాదారులు, ఏజెంట్లు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

మంత్రి శ్రీనివాస్ ● సోనియానగర్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రంలో రహదారులు, తాగునీరు, విద్యుత్ మొదలగు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక సోనియానగర్‌లో సుమారు రూ.5.19 కోట్ల ఖర్చుతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం మంత్రి కొండపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత టిడిపి ప్రభుత్వ హయాంలో సుమారు 7వేల మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒప్పందం చేసుకుంటే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దుచేసి, రాష్ట్రాన్ని విద్యుత్ లోటులోకి నెట్టిందని చెప్పారు. దీనివల్లే గత రెండేళ్లు విపరీతంగా విద్యుత్ కోతలు పెరిగిపోయాయన్నారు. ఆర్ఇసి నుంచి రుణం తీసుకొని విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసే అవకాశం ఉన్నా, అప్పటి ప్రభుత్వం దృష్టిపెట్టకుండా పూర్తిగా నిర్వీర్యం చేసిందని చెప్పారు. ఎమ్మెల్యే పూసపాటి అదితీ విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, సోనియానగర్‌లో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ వల్ల టిడ్కో కాలనీతోపాటు, వైఎస్ఆర్‌నగర్, గాజులరేగ తదితర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో వేణుగోపాలపురం వద్ద 220 కెవి సబ్‌స్టేషన్ మంజూరయ్యిందని, ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రక్కన పడేసిందని చెప్పారు. సుమారు రూ.200 కోట్లు ఖర్చు అయ్యే ఈ సబ్‌స్టేషన్‌కు ఇటీవలే తమ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇది పూర్తయితే విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని, భోగాపురం విమానాశ్రయానికి బ్యాకప్‌గా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఇఇలు పి.త్రినాధరావు, పి.హరి, ఎడిఇలు, డిఇలు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధిలో తొలి అడుగు

తాటిపూడిలో బోటింగ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

తాటిపూడి రిజర్వాయరులో బోటింగ్ ప్రారంభం ద్వారా జిల్లా పర్యాటక అభివృద్ధిలో తొలి అడుగు పడిందని చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గంట్యాడ మండలంలోని తాటిపూడి రిజర్వాయరులో సాహస జలక్రీడలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్య (పిపిపి) విధానంలో పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించాలని నిర్ణయించిందని చెప్పారు. దీనిలో భాగంగా వాటర్ స్పోర్ట్స్ సింపుల్ ఇండియా ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. సాహస జల క్రీడల్లో భాగంగా రిజర్వాయరులో తొలిదశలో వాటర్ ట్యాక్సీలు, స్పీడ్ బోట్లు ఏర్పాటు చేశారని చెప్పారు. రెండో దశలో జలక్రీడలను ఏర్పాటు చేయనున్నారని, మూడో దశలో హౌస్‌బోట్లు, ఫ్లోటింగ్ కాటేజీలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఈ సంస్థ ఇక్కడ బోటింగ్ ఏర్పాట్లు చేస్తోందన్నారు. రిజర్వాయరు అవతల ఉన్న దిగువ కొండపర్తి గిరిజనుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో బోటు సౌకర్యాన్ని కూడా త్వరలోనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. తాటిపూడి ప్రాజెక్టు ఈ ప్రాంతానికి రావడంలో బుచ్చి అప్పారావు కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని మాట్లాడారు. కార్యక్రమంలో వాటర్ స్పోర్ట్స్ సింపుల్ ఇండియా కార్యనిర్వహణ అధికారి జి.పాపారావు, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ జగన్నాథం, జలవనరుల శాఖ ఇఇ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

బోటులో ప్రయాణిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి, యశస్విని

రవాణా రంగ రక్షణకు మార్చిలో చలో పార్లమెంటు

ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ● 16 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో రవాణా రంగ రంక్షణ కోసం మార్చిలో తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని కార్మికులంతా జయప్రదం చేయాలని ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్మోహన్ రావు అధ్యక్షతన స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవన్‌లో శుక్రవారం 'రోడ్ రవాణా రంగ సవాళ్లు- ప్రభుత్వ విధానం'పై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులు రేయింబవళ్లు కష్టపడినా కనీసం రూ.500 కూడా రోజుకు ఇంటికి తీసుకెళ్లడం గగనంగా మారిందని, అందుకు ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఒక బ్యారర్ క్రూడ్ ఆయిల్ ధర 109 డాలర్లు ఉంటే, నేడు 73.49కు పడిపోయిందని, డీజిల్ ధర మాత్రం రూ.60 నుంచి రూ.100కు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం డబుల్ అయిందని, అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు, చలానాలు , టాక్సులు పెంచి డ్రైవర్ల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవి చాలవన్నట్లు ఎపిలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర రహదారులపై కూడా టోల్ గేట్లు పెట్టాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. విజయనగరంలో ఈ మూలకు వెళ్లినా టోల్ గేట్లు తప్పడం లేదని, రోడ్లకు గుంతలు పూడ్చే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. జాతీయస్థాయిలో మోటార్ వాహన చట్టం 2019ను సవరించాలని, అసంఘటిత రంగంలో ఉన్న డ్రైవర్ లందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఓబర్ , ఓలా ,రాపిడో వంటి ప్రైవేటు సంస్థల యాప్ లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే యాప్ లను రూపొందించాలని డిమాండ్ చేశారు. కేరళ వామపక్ష ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని, ప్రైవేట్ యాప్‌లకు బదులుగా సవారి పేరుతో ప్రభుత్వమే ఆరు శాతం కమిషన్‌తో నడుపుతుందని, అందులో రెండు శాతం కమిషన్ డ్రైవర్ల సంక్షేమానికి ఖర్చు చేస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వం మాత్రం కార్పొరేట్లకు 16 లక్షల కోట్లు రుణమాఫీ చేసి డ్రైవర్ల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని తెలిపారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస ప్రసంగించారు. అనంతరం 16 మంది తో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా కె.సురేష్, కో కన్వీనర్‌గా ఎ. జగన్మోహన్రావు, సభ్యులుగా బి.పాపారావు, బి.రామునాయుడు, టి. సూరిబాబు, బి.అప్పలనాయుడు, సూర్యనారాయణ, దేవుడు, నాయుడు, రాజు, సత్తిబాబు, ఉమామహేశ్వరరావు, గురు నాయుడు, మూర్తి, ముత్యాలు, వెంకట్రావు ఎన్నికయ్యారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శుక్రవారం సాదాసీదాగా జరిగి అజెండాలో పొందుపరిచిన 8 అంశాలపై చర్చ అనంతరం వాటిని సభ్యులు ఆమోదించారు. వివిధ అంశాలపై పలువురు కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల పలువురు కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో నిధులు కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేసే అంశమై అధికారులు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అందరి ఆమోదంతో అంబేద్కర్ భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది. పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ అందరి సమిష్టి కృషి ఫలితంగా నగరాభివద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఆర్థిక వనరులను పెంపొందించుకొని తద్వారా ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి,ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మారిక రోడ్డు పనులు ప్రారంభం

- సిపిఎం పోరాటంతో స్పందించిన అధికారులు
- ఎంపిడిఒ కార్యాలయం వద్ద వంటావార్పు ముగింపు

ప్రజాశక్తి-వేపాడ

సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు చేపట్టిన పోరాటానికి అధికారులు దిగొచ్చారు. మారిక రోడ్డు పనులను వెనువెంటనే ప్రారంభిం చారు. దీంతో ఎంపిడిఒ కార్యా లయం వద్ద గిరిజనులు చేపట్టిన వంటావార్పు కార్యక్రమాన్ని శుక్రవారం ముగించారు.

వేపాడ మండలంలోని గిరిజన గ్రామమైన మారికకు రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఎం ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం ఎదుట గిరిజనులు గురువారం వంటావార్పు కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. రెండో రోజు శుక్రవారం కూడా గిరిజనులు ఆందోళనను కొనసాగించారు. ఎంపిడిఒ సిహెచ్.సూర్య నారాయణ స్పందించి, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆందోళన వద్దకు పంచాయతీరాజ్ డిఇ సత్యనారాయణ, ఎంపిపి సత్యవంతుడు, ఎంపిడిఒ సూర్యనారాయణ, సిఐ అప్పలనాయుడు, జెఇలు ఐశ్వర్య, ఆలీ, ఎస్ఐ దేవి చేరుకుని, సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్‌తో చర్చించారు. మధ్యలో నిలిచిన రోడ్డు పనులు శనివారం పున:ప్రారంభిస్తామని హామీనిచ్చారు. దీనికి సిపిఎం నాయకులు జగన్ అంగీకరించలేదు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాల్సిందేనని పట్టుబట్టారు. అప్పటివరకూ వంటావార్పు కొనసాగిస్తామని స్పష్టంచేశారు. చివరికి అధికారులు స్పందించి, రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో ఆందోళనను గిరిజనులు విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

మహిళా కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

విజయనగరంకోట : స్టయిఫండరీ మహిళా పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షల ప్రక్రియ ప్రారంభమైంది. 550 మంది మహిళా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 314 మంది హాజరయ్యారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభమైంది. ఎస్పి వకుల్‌జిందాల్, అదనపు ఎస్పి పి.సౌమ్యలత పర్యవేక్షించారు. ఈనెల 4, 6వ తేదీల్లో కూడా ఎంపిక పరీక్షలు జరుగుతాయని ఎస్పి తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో ఎఆర్ అదనపు ఎస్పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు యూనివర్స్, ఎం.వీరకుమార్, ఎస్. బాపూజీ, టి.ఎన్.శ్రీనివాసరావు, కె. థామస్ రెడ్డి, ఎఒ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథానికి దోహదం

సైన్సుఫేర్ ప్రారంభంలో ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహద పడతాయని విద్యా శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ బాలికల హైస్కూల్లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఆలోచన విధానం, ప్రశ్నించే గుణం ,శాస్త్రీయ ఆలోచన పెంచేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదం చేస్తాయన్నారు. డిఇఒ యు. మాణిక్యం నాయుడు మాట్లాడుతూ ప్రధానంగా మూడు విభాగాల్లో విద్యార్థి వ్యక్తి గత ప్రదర్శన ,విద్యార్థులు గ్రూపు ప్రదర్శన, ఉపాధ్యాయులు వ్యక్తిగత ప్రదర్శన మూడు విభాగాల్లో ఎగ్జిబిట్స్ ఉంటాయన్నారు. మూడు విభాగాల్లో ఎంపికైన మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినవి నేడు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు 81 ప్రాజెక్టులు వచ్చాయన్నారు. వీటిలో మూడు విభాగాల్లో ఎంపిక చేసి రాష్ట్ర ప్రదర్శనకు పంపుతామన్నారు. అనంతరం ప్రదర్శనను తిలకించిన అధికారులు ప్రాజెక్టు తయారీ విధానం, ఉపయోగాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఆర్‌జెడి విజయభాస్కర్

రాష్ట్ర పోటీలకు 6 ప్రాజెక్టులు ఎంపిక

జిల్లా స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర పోటీలకు మూడు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన ఆరు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మొదటి స్థానంలో నిలిచిన విజేతలకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతల్లో వ్యక్తిగత విభాగంలో ప్రథమ స్థానం ఎస్.ధనోజ్, పెదవేమలి జెడ్‌పి ఉన్నత పాఠశాల, వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానం ఆర్.శివ, గ్రూప్-డి విభాగంలో ప్రథమ స్థానం తోంద్రంగి జెడ్‌పి ఉన్నత పాఠశాల బి. దుర్గప్రసాద్, వి.మణికంఠ ఎంపికయ్యారు. ద్వితీయ స్థానం వియ్యంపేట బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులు టి. సంజన, పి. సుష్మ ఎంపికయ్యారు. ఉపాధ్యాయ విభాగంలో ప్రథమ స్థానం బి. శ్రీనివాసరావు(రామతీర్థం జెడ్‌పి ఉన్నత పాఠశాల), ద్వితీయ స్థానం సి.హెచ్. ఉమమహేశ్వరరావు (జెడ్‌పి ఉన్నత పాఠశాల గుర్ల)ఎంపికయ్యారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ పారిశుధ్య కార్మికులతో సమానంగా బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ. 24,500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్ రావు మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీరు అందించటం, నగర సుందరీకరణ లో ముఖ్య పాత్ర వహిస్తున్న పంపు హౌస్, వాల్ ఆపరేటర్లు, లీకులు,బోర్ మెకానిక్‌లు, విలీన ప్రాంత, ప్లాంటేషన్, స్ట్రీట్ లైటు, మొక్కలు, పార్కుల్లో పనిచేసే ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ వర్కర్లు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న జీతభత్యాల్లో తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన 54 మందిని, విలీన ప్రాంత కార్మికులు 11 మందిని ఆప్కాస్ లో చేర్చాలని. థర్డ్ పార్టీలో కొనసాగుతున్న పంపు హౌస్ ,లీకులు, వాల్ ఆపరేటర్లు, మొక్కలు, స్ట్రీట్ లైట్ పార్కుల్లో పనిచేసే కార్మికులకు టెండర్ ప్రకారం ప్రతి నెలా 10వ తేదీ లోపు జీతం చెల్లించాలని, బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని, మట్టి ఖర్చులు , ఎక్స్ గ్రేషియా పెంపు , మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఉద్యోగి అనే పదాన్ని తొలగించి అందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ఆదినారాయణ, సత్య నారాయణ, వి.నరసింహులు, ఎస్.రామనాయుడు, కె.గౌరి, నాయుడు, శంకర్, చంద్రశేఖర రావు, ప్రసాద్, ధనంజయ, లక్ష్మణ్ , రోహిత్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

నెల్లిమర్ల : మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఇంజనీరింగ్ విభాగం నాయకుల శ్రీను, పైడి రాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

న్యాయవాదుల నిరసన

శృంగవరపుకోట : అనంతపురం పోలీస్‌స్టేషన్లో సివిల్ కేసు పంచాయితీకి పిలిచి, సీనియర్ న్యాయవాది బి.వి.శేషాద్రి మృతికి కారణమైన సిఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు నిరసన తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.ఐదు కోట్లు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సూరిదేముడు ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో కార్యదర్శి బి.సత్యనారాయణ, కోశాధికారి బి.త్రిమూర్తులు, ఎన్.టి.వి.దాసు, ఎం.కామేశ్వరరావు, జి.ప్రకాశరావు, బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గురమ్మవలస వద్ద బస్సు బోల్తా

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని గురమ్మవలస గ్రామ సమీపంలో శుక్రవారం ఆర్‌టిసి బస్సు బోల్తా పడింది. జక్కువ నుంచి విజయనగరం వెళుతున్న ఆర్‌టిసి బస్సు మలుపు వద్ద అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో ఆరుగురు ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్ మాత్రమే ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికి ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఆండ్ర ఎస్ఐ కె.సీతారాం కేసు నమోదు చేశారు.

బోల్తా పడిన బస్సు

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రజా సమస్యల పట్ల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరును అధికారులు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, పినిశెట్టి రమణ, ఎంపిడిఒ సతీష్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని డిసిసి అధ్యక్షులు ఎం. విద్యాసాగర్ (వినయ్) అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మన్మోహన్ సింగ్ సంతాప సభలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మన్మోహన్ సింగ్ చేసిన సేవలు మరువలేనివన్నారు ఆర్థిక సంస్కరణలు తీసుకురావడంలోనూ, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలోను ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు.ఆయన సలహాలు, సూచనలు పార్టీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పూడి శ్రీనివాసరావు , ఎస్.కోట నియోజకవర్గం కోఆర్డినేటర్ గేదెల తిరుపతి, నెల్లిమర్ల నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్, చీపురుపల్లి కోఆర్డినేటర్ రామచంద్ర రాజు, రాజాం కోఆర్డినేటర్ చైతన్య, మాజీ రాష్ట్ర మైనార్టీ నాయకులు షరీఫ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాలను శుక్రవారం పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజామున నుంచి పొగమంచు దట్టంగా కురవడంతో చలి తీవ్రత పెరిగింది. రోడ్డు కనిపించకపోవడంతో వాహనాలకు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. పొగమంచుతో బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడ్డారు. మంచు మామిడి, జీడి పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన హక్కులు కాలరాస్తే ఉద్యమం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని దుప్పలపూడి పంచాయతీ రొంపల్లివలస గిరిజన గ్రామంలో రెవెన్యూ అధికారులు గిరిజనుల హక్కులు కాలరాస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి బలసా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి ఆక్రమిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 40 ఎకరాల డి-పట్టా భూమిని భూస్వాములు ఆక్రమించినా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. రెవెన్యూ రికార్డులలో లోపాలను అడ్డుపెట్టుకొని ఇక్కడ భూస్వాములు కొద్ది సంవత్సరాలుగా ఆ భూముల్లో ఫలసాయం అనుభవిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపి నిరుపేద గిరిజనులకు ఆ భూములు పంపిణీ చేయాలని కోరారు.

కాలువలను శుభ్రం చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీలోని పాతబొబ్బిలిలో ఆమె శుక్రవారం పర్యటించారు. పల్లివీధి, రామమందిరం వద్ద కాలువల్లో పూడికలు తీయాలని ఆదేశించారు. ప్రతిరోజూ కాలువలను, రోడ్లను శుభ్రం చేయాలని కోరారు. కుళాయి నీటికి క్లోరినేషన్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చోడిగంజి రమేష్, కోట పెదరాములు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాటంతోనే భూసంస్కరణలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కమ్యూనిస్టుల పోరాటం వల్లే దేశంలో భూసంస్కరణలు చేపట్టారని సిపిఐ నాయకులు మొయిద పాపారావు తెలిపారు. సిపిఐ శత వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కొండగుంపాంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, హక్కుల కోసం కమ్యూనిస్టులు నిరంతర పోరాటం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోలిపల్లి సూరి, యడ్ల పైడినాయుడు, బండ సత్యనారాయణ పాల్గొన్నారు.

5 నుంచి గురుకులంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈ నెల 5 నుంచి మహత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకులంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.బి.బి.రావు తెలిపారు. జోన్ స్థాయిలో జరిగే పోటీలకు ఉత్తరాంధ్రలోని 14 విద్యాసంస్థల నుంచి క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు.

సింగరాయిలో గ్రామసభ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో సర్పంచ్ నిరుద్యోగి వెంకటరావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ ఏర్పాటుచేశారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులపై తీర్మానాలు చేశారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వై.సత్యవతి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరకముడిదాంలో గ్రామసభ

మెరకముడిదాం : మండల కేంద్రమైన మెరకముడిదాంలో శుక్రవారం సర్పంచ్ బోనెల కన్నమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కాలువల్లో పూడికతీతలు, సిసి రోడ్లు, డ్రైయిన్లు, వీధిలైట్లు, తాగునీటి సదుపాయం వంటి కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గోపి, ఉపసర్పంచ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

'సీతం'లో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'మల్టీప్లై సంస్థ' క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. బి.టెక్, ఎంబిఎ, బిబిఎ విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు జూమ్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూ నిర్వహించి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. వీరికి 3 లక్షల ప్యాకేజీ తో నియామక పత్రాలు అందజేశారు . ఈ ఎంపిక ప్రక్రియను మల్టీప్లై సిఇఒ శ్రీ హర్ష గుప్తా, మానవ వనరుల విభాగాధిపతి శ్రీ శ్వేత నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 18 దరఖాస్తులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పికెఆర్‌పురం, రామస్వామిపేటలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 18 దరఖాస్తులు వచ్చాయి. సదస్సుల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకం

పలుచోట్ల జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయరాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జీవితం మహిళా లోకానికి ఎంతో స్ఫూర్తి దాయకమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయిపూలే 194 వ జయంతి జిల్లా వ్యాప్తంగా జరిగింది. ఎల్‌బిజి నగర్ లో ఐద్వా ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రమణమ్మ మాట్లాడారు. సావిత్రిబాయి పూలే బాలికల విద్యకు ఎంతో పాటుపడ్డారని, అంతకుమించి స్త్రీల సమస్యలపై పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి .పుణ్యవతి నగర నాయకులు రామలక్ష్మి, కష్ణమ్మ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విజయనగరం జిల్లాలో విద్యాభివృద్ధి కోసం పోరాడదామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అన్నారు. పూలే విగ్రహం వద్ద నిర్వహించిన కార్యమంలో ఆయన మాట్లాడారు. ఆమె స్ఫూర్తితో విజయనగరంలో విద్యాభివృద్ధికి పోరాడతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, రంభశ్రీను, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్ , డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి హరీష్, భవన నిర్మాణ కార్మిక సంగం నాయకులు త్రినాథ్ తది తరులు పాల్గొన్నారు - స్థానిక గురజాడ పాఠశాల కంటోన్మెంట్లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎం.వి.ఆర్.కృష్ణాజి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని తెలిపారు. హెచ్‌ఎం పి.శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దత్తిరాజేరు : మండలంలోని రామచంద్రపురం ఉన్నత పాఠశాలలో మండల యుటిఎఫ్ అధ్యక్షులు మామిడి చంద్రరావు అధ్యక్షతన ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కిల్లాడ అప్పారావు మాట్లాడారు. కొనియాడారు. అనంతరం హెచ్‌ఎం జి.కృష్ణవేణిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి కష్ణవేణి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి రాంప్రసాద్, మండల సహాధ్యక్షురాలు బిబియల్ మాధవిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరం, పురిటిపెంటలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.హరికృష్ణవేణి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణవేణి మాట్లాడుతూ నిమ్నజాతుల అభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు.



బొబ్బిలి, విజయనగరంలో నివాళులర్పిస్తున్న పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి, యుటిఎఫ్, సిపిఎం నాయకులు

సావిత్రిబాయి స్ఫూర్తితో మహిళాభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, బాలరాజు, గంగయ్య, జెరి లక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సనాతన ధర్మం పేరుతో మహిళలను అణగతొక్కేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు విమర్శించారు. స్థానిక శ్రీవిద్యా జూనియర్ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికల చదువుకు ప్రాధాన్యత ఇచ్చిన సావిత్రిబాయి పూలే పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యను అందించారని గుర్తుచేశారు. సనాతన ధర్మం పేరుతో మహిళలపై జరుగుతున్న దాడిని, కుల, మత విద్వేషాలను సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కె.పుణ్యవతి, సిఐటియు నాయకులు సురేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు రోజా, విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీనిధి హైస్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి, యుటిఎఫ్ నాయకులు.. సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పట్టణంలో ఆమె చిత్రపటానికి అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సొరు సాంబయ్య, బలగ రాధ, గోపాలరావు, ఎన్.మున్నా పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ కాలనీ మున్సిపల్ పాఠశాలలో ఉన్న పూలే విగ్రహానికి కాలనీ కమిటీ సభ్యులు ఆర్.జగదీష్, రామ్మోహన్, చంద్ర, ఉపాధ్యాయులు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు ఆహార పొట్లాలు, పండ్లను ఖాన్ పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యాన జిల్లా చైర్మన్ జెసి రాజు.. సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు.

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఇఒలు జి.జగదీశ్వర్‌రావు, పి.బాలభాస్కరరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులకు ఎంపిపి డి.సత్యవంతుడు, ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, తహశీల్దార్ జె.రాములమ్మ ఘనంగా సన్మానించారు.

గజపతినగరం.. సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న నాయకులు

6 నుంచి మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ నెల 6వ తేదీ నుంచి మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ ప్రక్రియపై జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, వైద్యాధికారులతో శుక్రవారం తమ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ల్లాలోని వైద్య పింఛన్లలో పూర్తిగా మంచానికే పరిమితమై పింఛను పొందుతున్నవారు 342 మంది ఉన్నారని, తొలివిడతలో వీరి పింఛన్లను రీ వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. తరువాత దశలో మిగిలిన వైద్య పింఛన్లను పరిశీలిస్తారని చెప్పారు. రీ వెరిఫికేషన్‌కు ఇతర జిల్లాలనుంచి 6 బృందాలు వస్తాయని చెప్పారు. ఒక్కో బృందంలో ఒక ఆర్థోపెడిక్ డాక్టర్, ఒక జనరల్ మెడిసన్ స్పెషలిస్ట్, వైద్యాధికారితోపాటు ఒక డిజిటల్ అసిస్టెంట్ ఉంటారని తెలిపారు. వీరంతా ఆయా రోగులను, వారి మెడికల్ సర్టిఫికేట్, సదరం, ఆధార్ తదితర ధ్రువపత్రాలను పరిశీలించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు. వరుసగా మూడు రోజుల పాటు ఈ బృందాలు పర్యటిస్తాయని, మూడు రోజుల విరామం తీసుకుంటాయని చెప్పారు. వీరి తనిఖీలకు వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు.

సంక్రాంతి పండుగకు ముందే వీలైనంత ఎక్కువమందిని తనిఖీ చేసేటట్లుగా చూడాలని సూచించారు. పింఛనుదారుల అర్హతలను, ధ్రువపత్రాలను పరిశీలించడానికి మాత్రమే ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపడుతోందని, అర్హుల పింఛన్లు తొలగించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డిఆర్‌డిఒ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఇపిఒ టి.వెంకటేశ్వర్రావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, డిటిసి డాక్టర్ కె.రాణి, ఆర్‌బిఎస్‌కె డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

నియోజకవర్గంలో ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ శారదాదేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల ఎపిఒలు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. పల్లెపండగ పనులు, గోకులాలు, చేపల చెరువుల పనులు, ట్రెంచ్ కటింగ్, అమృత్ సరోవర్ పనులపై సమీక్షించారు. ఈ పనులు మార్చి నాటికి పూర్తి చేసి, కొత్త పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు.

40 శాతం పనులు పూర్తి

జిల్లాలో పల్లె పండగ పనులు 40 శాతం పూర్తి చేసినట్లు డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1092 సిసి రోడ్లకు గాను 652 పూర్తి అయ్యాయని చెప్పారు. వీటికి ఇప్పటివరకు రూ.22 కోట్లు బిల్లులు చెల్లించామన్నారు. ఇంకా రూ.12 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. 1022 గోకులాలకు గాను 200 పూర్తయ్యాయని, మరో 200 వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. రోజుకు రూ.300 కూలి వచ్చేలా వేతనదారులకు అవగాహన కలిస్తున్నామని చెప్పారు. చెరువులను చేపల చెరువులుగా మార్చి, ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. 406 చేపల చెరువుల పనులు చేపట్టామని, 379 వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇంకా 800 చెరువులను చేపట్టేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఎపిఒలు రాజు, విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో పిల్లలకు కారాడకు చెందిన సన్‌రైస్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ.50 వేలు విలువైన పరికరాలను అందజేసింది. వీటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. సన్ రైస్ సంస్థ అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఎంఇఒలు లక్ష్మణరావు, వాసు, వెలుగు ఎపిఎం భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కోటలో శుక్రవారం సేవా స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ కేలెండర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లాడ భాస్కరరావు, బి.తవిటినాయుడు, సేవా సంస్థ అధ్యక్షులు లంక వాసు, సభ్యులు పాల్గొన్నారు.

రిబ్బన్ కట్ చేసి పరికరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

రోడ్ల మరమ్మతులకు రూ.3.32 కోట్లు

ఆర్అండ్‌బి డిఇ రవిశేఖర్

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్లపై గుంతలను పూడ్చడానికి ప్రభుత్వం రూ.3.32 కోట్లు మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బి డిఇ ఆర్.రవిశేఖర్ చెప్పారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిఒ 53 కింద 9 పనులకు రూ.1.47 కోట్లు, జిఒ 348 ద్వారా 4 పనులకు రూ.1.45 కోట్లు, జిఒ 349 కింద 9 పనులకు రూ.40.35 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, క్వాలిటీ కంట్రోల్ నాణ్యతను పరిశీలించిన తర్వాత బిల్లులు ప్రాసెస్ చేస్తామని తెలిపారు. గొర్లెసీతారాంపురం, బాడంగి, రామభద్రపురం రోడ్లను బాగు చేసేందుకు 9.5 కిలోమీటర్లకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. నాబార్డు నిధులతో నాన్ బిటి రోడ్లను బిటి రోడ్లుగా నిర్మించేందుకు తెర్లాం మండలంలో రెండు పనులకు రూ.4 కోట్లు, బొబ్బిలి మండలంలో రూ.1.10 కోట్లు, బాడంగి మండలంలో రూ.65లక్షలతో ప్రతిపాదనలు చేశామని చెప్పారు. జె.రంగరాయపురం, భీమవరం, ముగడ రోడ్డు 7.3 కిలోమీటర్లు, తెర్లాం మండలం గోలుగువలస, బూరిపేట, బూర్జవలస రోడ్లు 7.73 కిలోమీటర్లను పంచాయతీ రాజ్ నుంచి ఆర్అండ్‌బి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆయా రోడ్లకు ఆర్అండ్‌బి నంబర్లు వచ్చిన తర్వాత నిధులు మంజూరుకు ప్రతిపాదనలు చేస్తామన్నారు. బొబ్బిలి-తెర్లాం 15 కిలోమీటర్ల రోడ్డుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. చిలకపాలెం రోడ్డు ఉత్తరావల్లి జంక్షన్ నుంచి మెట్టవలస జంక్షన్ వరకు 12 కిలోమీటర్ల రోడ్డుకు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. బొబ్బిలి రైల్వే ఫ్లై ఓవర్ కింద నుంచి లచ్చయ్యపేట పైపుల ఫ్యాక్టరీ వరకు 2.95 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు చేశామని వివరించారు.

కలుషిత నీటిపై నివేదిక కోరిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-భోగాపురం

ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంటామని ఎమ్మెల్యే లోకం మాధవి తెలిపారు. మండలంలోని గూడెపువలస ప్రాంతంలో కొండరాజు చెరువు వద్ద కెమికల్ నీరు డంప్ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యేకు పలువురు తెలిపారు. దీంతోఈ నీరు ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించినదా లేదా కెమికల్ ఇండస్ట్రీ నుంచి తెచ్చి చెరువులో వదిలేస్తున్నారా అన్న దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనివల్ల సమీప గ్రామమైన ముగడపేటలో పర్యావరణం దెబ్బతిని, రెండు ఆవులు మరణించాయి. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే జనసేన నాయకులు లోకం ప్రసాద్, గజపతినగరం ఇంచార్జ్ మర్రాపు సురేష్, మిడతాన రవి, గూడెపువలస సర్పంచ్ అయ్యప్పరెడ్డి, జనసేన ముంజేరు నాయకులు జోగారావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి చెరువులో కెమికల్ నీటిని డంప్ చేస్తున్నది ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎయిర్‌పోర్ట్ ప్రతినిధులతోను, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారులతో మాట్లాడి, ఆ చెరువులో నీటి కలుషితంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కోరారు. పరిస్థితిని సమీక్షించిన కాలుష్య నియంత్రణ బందం అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ముస్తాబవుతున్న గోకులాలు

ప్రజాశక్తి- తెర్లాం

పాడి రైతుల కోసం ప్రభుత్వం గోకులం పథకంలో మంజూరు చేసిన షెడ్లు సిద్ధమవుతున్నాయి. మండలానికి 58 గోకులాలు మంజూరు కాగా, అందులో 10 పూర్తయినట్లు మండల పశుసంవర్ధక శాఖాధికారి నరేంద్ర తెలిపారు. మిగతా నిర్మాణ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. సంక్రాంతి మరుసటి రోజు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గోకులాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

గోకుల షెడ్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖాధికారి నరేంద్ర

సిఎంతో మాట్లాడుతున్న కంది చంద్రశేఖర్‌రావు

సిఎంను కలిసిన కంది

సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిడిపి నియోజకవర్గ సీనియర్ నేత కంది చంద్రశేఖర్‌రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలను సిఎంకు వివరించారు.

- ప్రజాశక్తి, డెంకాడ

గణపతిని సన్మానిసున్న దళిత సంఘాల జెఎసి నాయకులు

మజ్జి గణపతికి ఘన సన్మానం

ప్రజాశక్తి-వంగర

జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన మజ్జి గణపతిని వంగరలో శుక్రవారం దళిత సంఘాల జెఎసి నాయకులు, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ బోనెల రామారావు, డర్రు రాంబాబు, అప్పలస్వామి, గణపతిరావు, రవణమ్మ, జయకృష్ణ, రాజు, గంగులు, బుజ్జి, మన్మథరావు, ఉదయ్‌రామ్ పాల్గొన్నారు.

సూర్యఘర్ ప్రాధాన్యతను అందరికీ తెలపండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సూర్యఘర్ పథకం విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలిసేలాకృషి చేయాలని సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య చెప్పారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాల వివరాల నమోదును ఈనెల 10లోగా పూర్తి చేయాలని చెప్పారు. సూర్యఘర్ పథకం ఆవశ్యకతను అపార్ట్మెంట్ అసోసియేషన్ల తో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, హోటళ్ల వంటి సంస్థల్లో సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు 30లోగా కృషి చేయాలన్నారు. సమావేశంలో టిపిఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

వరికుప్పలు పరిశీలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని సంతగౌరమ్మపేటలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన వరికుప్పలను, అపరాల పంటలను జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరికుప్పలను నూర్పు చేసి రైతుసేవా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ఎల్.విజయ, విఎఎ రవి, జెడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి కుప్పలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రామారావు

అంబేద్కర్ రాజ్యాంగం అవసరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం అవసరమని ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పి.షణ్ముఖరావు అన్నారు. అంబేద్కర్ కూడలిలో గల ప్రజా గ్రంథాలయంలో శుక్రవారం ఆపార్టీ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తిగా ప్రజా విజయం పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్ రాజు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్లో అంబేద్కర్ పై మాట్లాడిన తీరు బాధాకరంగా ఉందన్నారు. రాజ్యాంగ బద్ధంగా వచ్చిన పదవులు అనుభవిస్తూ, అదే రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడటం దురదృష్టకరం అన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థను కాపాడుకోవాలంటే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఇందుకోసం ప్రజలంతా సంఘటితమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా విజయం పార్టీ కార్యదర్శి సిహెచ్ బంగారు రాజు, మహిళా సంఘం కన్వీనర్ జి.భవాని, శీరాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెసి సేతు మాధవన్

నవోదయను సందర్శించిన జెసి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం వద్దనున్న జవహర్ నవోదయ విద్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ శుక్రవారం సందర్శించారు. విద్యాలయంలో ఏర్పాటుచేసిన పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతిరోజూ నిర్వహించే అసెంబ్లీలో జెసి విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ఎ.రఘు పాల్గొన్నారు.

విఆర్‌ఒపై అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-బొబ్బిలి

కులం పేరుతో దూషించిన చింతాడ విఆర్‌ఒ అడపా గౌరీశంకర్‌పై అట్రాసిటీ కేసు నమోదైంది. పారాది గ్రామానికి చెందిన నగర పోలమ్మ భూమి పాస్ బుక్ కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళుతుండగా మార్గం మధ్యలో ఆమెను ఆపి కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పట్టణ సిఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేశారు. డిఎస్‌పి శ్రీనివాసరావు సమగ్ర విచారణ చేస్తారని చెప్పారు. గౌరీశంకర్ గతంలో నారాయణప్పవలసలో పని చేయగా, ప్రస్తుతం చింతాడలో పని చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్

బొబ్బిలి : రామభద్రపురం నుంచి బొబ్బిలి మండలం గున్నతోటవలస అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యాపారి పి.రాధాకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమేష్ చెప్పారు. మద్యం తెస్తున్నట్లు పట్టణ సిఐ సతీష్ కుమార్ కు సమాచారం రావడంతో ఆయన ఆదేశాలు మేరకు గ్రోత్ సెంటర్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆయన్ను కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. దాడిలో ఎఎస్ఐ భాస్కరరావు ఉన్నారు.